క్లుప్తంగా

శివాజీ జయంతి సందర్భంగా శోభాయాత్ర



శోభాయాత్ర

మార్కాపురం టౌన్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి గుడి నుంచి తేరు బజార్, మెయిన్ బజార్, పాత బస్టాండ్, నాయుడు వీధి మీదుగా నాలుగు మండపాల్లో ర్యాలీ నిర్వహించారు. కోలాటా నృత్యాల మధ్య వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ర్యాలీలో గోపాలుని హరిహరరావు, వెంకటరమణ, డి. చంద్రశేఖర్, ఇమ్మడిశెట్టి వీరరావు, కో ఆప్షన్ సభ్యురాలు వనజాక్షి, శ్రీధర సాయిసుబ్బారావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత



వృద్ధులకు అందించిన నిత్యావసరాలు

తాళ్లూరు: మండలంలోని గుంటి గంగ తేజ వయో వృద్ధాశ్రమానికి ఆదివారం జనసేన సేవా సమితి నిత్యావసరాలు అందించి చేయూత ఇచ్చారు. డిష్ చిరంజీవి ఆధ్వర్యంలో పార్వం పాండురంగానాయుడు సహకారంతో వృద్ధాశ్రమానికి 50 కేజీల బియ్యం, నూనె బాక్స్ అందించారు.

బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు నిరసన



నిరసనకు దిగిన వీర్రాజు, పార్టీ నాయకులు

మార్కాపురం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆదివారం మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న బీజేపీ కార్యాలయంలో అరగంట సేపు నిరసన కార్యక్రమం చేపట్టారు. హిందూ దేవుళ్లను కించపరిచే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. రథం కాలిపోయిన సంఘటనలో నిందితులను అరెస్టు చేయలేదన్నారు. దేవుళ్లకు కూడా పార్టీ రంగులు ఆపాదించడం మంచిదికాదన్నారు. హిందుత్వాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి జి.సత్యనారాయణ, పార్టీ నాయకులు రమణ, శాసనాల సరోజని, లక్ష్మి, పైడిమర్రి శ్రీనివాసరావు, పీవీ కృష్ణారావు, చిన్నయ్య, రామచంద్ర, పొట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

25 నుంచి రంగ దీక్షలు ప్రారంభం

కంభం: నల్లమలలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త, గురుస్వామి ఎస్.పుల్లారెడ్డి ఆదివారం తెలిపారు. ఏప్రిల్ 6, 7, 8 తేదీల్లో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఒంగోలు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. నగరంలోని ఉత్తర బైపాస్‌లో ఉన్న గుడ్ న్యూస్ అంధుల పాఠశాల విద్యార్థులకు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దుస్తులు అందజేశారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే లక్ష్యంతో విద్యార్థులు ఇష్టంగా చదవాలని సూచించారు. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఐక్యవేదిక ద్వారా స్కూలు అవసరాలు తీర్చేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. అంధ విద్యార్థులకు సాయం చేయడంపై స్కూలు నిర్వాహకుడు స్వర్ణ మోహన్‌రావు సంతోషం వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ

చీమకుర్తి: మండలంలోని పల్లామల్లిలో రిటైర్డ్ టీచర్ మద్దాళి సుబ్బారావు నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కూనంనేనివారిపాలెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వేమా శేషు, శ్రీదేవి దంపతులు రూ.10 వేల విలువ చేసే నిత్యావసరాలు అందించారు. వాటిని జెడ్పీటీసీతో కలిసి వృద్ధాశ్రమం నిర్వాహకుడు సుబ్బారావుకు అందించారు. అనంతరం వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. ఉద్యోగ విరమణ చేసిన అనంతరం సుబ్బారావు వృద్ధులకు సేవచేయడాన్ని అభినందించారు. దాత వేమా శేషు దాతృత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో దాసరి హనుమంతరావు, బత్తుల అర్జున్, ఇస్తర్ల శంకర్, దూపాటి సత్యం, స్థానికులు పాల్గొన్నారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణం



సలనూతలలో శివపార్వతులు



పోలేరమ్మ అమ్మవారి మూలవిరాట్



కల్యాణం అనంతరం దర్శనమిస్తున్న శివపార్వతులు



ముస్తాబైన అమ్మవారు..



ఈగలపాడు: అలంకరణలో సంగమేశ్వరుడు



రెడ్ల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం



దర్శి మండలం తానంచింతల గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం

కొనకనమిట్ల: మహా శివరాత్రి సందర్భంగా రెండో రోజు ఆదివారం మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రం, సలనూతల రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో శివ, పార్వతుల కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొనకనమిట్లలో ఆలయ వేదపండితులు అకలంకం రామకృష్ణమాచార్యులు, సలనూతలలో సత్యనారాయణ, ఆంజయ్య పర్యవేక్షణలో ముందుగా పార్వతి, పరమేశ్వరులకు అర్చనలు, అభిషేకాలు చేశారు. కల్యాణ ఉభయ దాతలుగా పలువురు దంపతులు పాల్గొని శివపార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎదురాళ్లపాడులో ప్రసిద్ధిగాంచిన గంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయం, బ్రాహ్మణపల్లి కాశీవిశ్వేశ్వర ఆలయం, సలనూతల, అంబాపురం శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. వాగుమడుగు, రేగడపల్లి, గనివానిపాడు, అంబాపురం, కొత్తపల్లి, చవటపల్లి, వద్దిమడుగు, కొనకనమిట్ల, చింతగుంట్ల తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం

మార్కాపురం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వేకువ జామున మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ప్రతిష్ఠించి భక్తుల శివనామస్మరణ మధ్య అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. చైర్మన్ వి.కేశవరావు, ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు శేషగిరిరావు, రామలక్ష్మి, శ్రీనివాసరావు, లక్ష్మీకాంతం, లక్ష్మీగాయత్రి, రాములక్క తదితరులు పాల్గొన్నారు. ముందుగా స్వామి వారికి ఎదురుకోల గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నంది వాహనంపై మహేశ్వర అలంకారంలో శివపార్వతులు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు సోమవారం గజవాహనంపై సార్వభౌమాలంకారంలో దర్శనమివ్వనున్నారు.

పోలేరమ్మ ఉత్సవాలు ప్రారంభం

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మ వారికి ఉగాది ముందు వచ్చే ప్రతి ఆదివారం మార్కాపురంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించటం ఆనవాయితీ. ఉగాది పండగకు నెల ముందు, శివరాత్రి తర్వాత వచ్చే మొదటి ఆదివారం నుంచి ఉగాది వచ్చే వరకు ప్రతి ఆదివారం పోలేరమ్మ అమ్మవారికి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. భక్త జన సందోహంతో ఆలయం ప్రాంగణం నిండిపోయింది. శ్రీ అల్లూరి పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఈ ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి గాంచింది. మార్కాపురం పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కుంకుమ బండ్లతో ఆలయానికి చేరుకున్నారు. డివిజన్‌లోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి వేకువ జాము నుంచే బారులు తీరి అమ్మవారికి అర్చకులు పూలమాలలు, నిమ్మకాయ దండలు సమర్పించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద నైవేద్యం తయారు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కుంకుమ బండ్లతో తీన్‌మార్ డప్పు వాయిద్యాల మధ్య డ్యాన్స్ చేస్తూ పోలేరమ్మ బండిని ఘనంగా ఊరేగించుకుంటూ కుంకుమ చల్లుకుంటూ వచ్చారు. భక్తులు తమ వాహనాలకు పూజలు చేసి గుడిచుట్టూ ప్రదర్శనలు చేయటం ఆనవాయితీ. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ బాసాని శ్రీనివాసులు, ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

గుంటి గంగకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు నాలుగు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ.6,412 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్‌రెడ్డి, ఆలయాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పెద్దదోర్నాలలో యాత్రికుల రద్దీ

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమైన భక్తులతో ఆదివారం పెద్దదోర్నాలలో రద్దీ వాతావరణం ఏర్పడింది. శ్రీశైలం రహదారిలో రెడ్ల సంఘం ఆధ్వర్యంలో గంటా రమణారెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో భక్తులకు అన్నదానం చేశారు. ఇస్కాన్, శ్రీకృష్ణ దేవరాయల కాపు, బలిజ, ఒంటరి, తెలగ, సేవా సంఘం, దర్శి మండలం తానం చింతల గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానంతోపాటు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.

వైభవంగా సంగమేశ్వరుడి తిరునాళ్ల

పొదిలి రూరల్: పొదిలి మండలం ఈగలపాడు, అన్నవరం గ్రామాల్లో ఆదివారం మహాశివరాత్రి ఉత్సవాలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈగలపాడు సంగమేశ్వరుడు దేవాలయం, అన్నవరం రామలింగేశ్వరిని ఆలయాలను నిర్వాహకులు సుందరంగా అలంకరించారు. రెండు గ్రామాల్లో ఉదయం నుంచే భక్తులు ఉపవాసాలతో దేవుని దర్శించుకుని పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈగలపాడు, గొల్లపల్లి, చిదంబరంపల్లి, వెలిగండ్ల, మంగాపురం, కుంచేపల్లి, ఆముదాలపల్లి, నిమ్మవరం, మల్లవరం తలమళ్ల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అన్నవరంలో రాత్రికి రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



నాగమయ్య శిలలకు పూజలు చేస్తున్న భక్తులు



అన్నవరంలో స్వామి వారికి పొంగళ్లు

ఘనంగా వీరభద్రస్వామి గ్రామోత్సవం

తర్లుపాడు: మండలంలోని జగన్నాథపురంలో ఆదివారం శ్రీ భద్రస్వామి గ్రామోత్సవాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా జగన్నాథపురం, మంగలికుంట గ్రామ సరిహద్దులోని మూడు కొండల మధ్య వెలసిన శ్రీభద్రస్వామికి దక్ష యజ్ఞం నిర్వహించి ఆదివారం వేకువ జామున ప్రభపై ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. మంగలికుంట, ఓబయ్యపల్లి, తాడివారిపల్లె నుంచి భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: తూర్పు రాయలసీమ నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల నుంచి పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. ఆదివారం రాత్రి తన క్యాంప్ కార్యాలయంలో పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. సుమారు 6 వేల ఓట్లు ఉన్నాయని, ఆరు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు కానున్నాయని, అందరూ ఇన్‌చార్జిలు ప్రచార బాధ్యతలు తీసుకోవాలన్నారు. మొదటి ప్రాధాన్యం ఓటును వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు వేయించాలన్నారు. ఎన్నికల రోజు ఓటింగ్‌పై కూడా ఇన్‌చార్జిలు దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలను పార్టీలు, కుల, మత, వర్గాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇచ్చారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఎంత లబ్ధి పొందింది వివరించాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు చాటకొండ చంద్ర, సిరాజ్, కొత్త కృష్ణ, హర్షిత, షేక్షావలి, మహ్మద్, అమీరుల్లాఖాన్, నగేష్, రామడుగు రమేష్, బాలసుబ్బారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్షావలి, కరీంబాషా పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకుందాం..



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అష్రఫ్ అలీ

మార్కాపురం: సమాజంలో అంతరించిపోతున్న మానవత్వాన్ని చాటుకునేందుకు తోటివారికి సాయం చేద్దామని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు అష్రఫ్ అలీ అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రెస్ క్లబ్‌లో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మానవత–నైతికతపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా మానవత్వాన్ని నైతికతను బతికించేందుకు జమాతే ఇస్లామి హింద్ చేస్తున్న కృషిని అభినందించారు. సమాజంలో నేరాలు, మారణహోమాలతో మానవత్వం నశిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పాటించాలని, మానవత్వం సత్యం ద్వారా ఇది సాధ్యమన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల బాబు, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రజాక్, రోజ్ లీడియా, నూతలపాటి రాజు, లూకయ్య, పల్నాటి రెహమాన్, అయూబ్ ఖాన్, మాలిక్ బాషా, సికిందర్, అజీజ్ అహ్మద్ పాల్గొన్నారు.



పొదిలి పట్టణంలో అశేష జనవాహిని మధ్య రథం



శంఖం పూరిస్తున్న నిర్వాహకుడు



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

వైభవంగా రథోత్సవం

పొదిలి రూరల్: పొదిలిలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. పొదిలి పరిసర ప్రాంతాల నుంచి రథోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పట్టణ వాసులు ఎవరికివారే స్వచ్ఛందంగా భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మార్కాపురం అడ్డ రోడ్డు, పొదిలి విశ్వనాథపురంలో ఆంజనేయస్వామిగుడి సెంటర్, కాలేజీ రోడ్డు, వైఎస్సార్ బొమ్మ సెంటర్, ఆర్టీసీ డిపో దగ్గర, పెదబస్టాండ్, చిన్న బస్టాండ్, అమ్మవారిశాల, పంచాయతీ ఆఫీసు, శివాలయం, అయ్యప్ప స్వామి గుడి, దాల్‌మిల్లుల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి దాతలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రథోత్సవం మిట్ట మధ్యాహ్నం సమయం కావడంతో ఎండ ఎక్కువగా ఉండటంతో చుట్టుపక్కల నుంచి వచ్చే వారికి మంచినీరు, మజ్జిగ, చల్లని పానీయాలు పంపిణీ చేశారు. పులిహోర, పొంగలి, పెరుగన్నం వంటి అల్పాహారంతో పాటు అన్నదానం ఎవరకు తోచిన విధంగా వారు ఎక్కడికక్కడ ఏర్పాటు చేసి భక్తుల ఆకలి తీర్చారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వైఎస్సార్ విగ్రహం వద్ద అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రథోత్సవం సందర్భంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆనందపరిచాయి. ముఖ్యంగా బాలికలు వేసిన కోలాటం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కొంతమంది కళాకారులు చేసిన విచిత్ర విన్యాసాలు చిన్నారులను కనువిందు చేశాయి. డప్పులు కొడుతూ..బాణసంచులు కాల్చుతూ యువకులు చిందులు వేసుకుంటూ తిరునాళ్లకు వచ్చిన వారిని ఉత్సాహపరిచారు.

70 మంది పోలీసులతో భారీ బందోబస్తు

రథోత్సవం సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో, పొదిలి సీఐ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో దర్శి, కొండపి సీఐలు రామకోటయ్య, శ్రీనివాసరావు, పొదిలి, కొనకనమిట్ల, తాడివారిపల్లి, ముండ్లమూరు, తాళ్లూరు, మర్రిపూడి ఎస్ఐలతో పాటు ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలో ఉన్న 50 మంది పోలీసులతో పాటు 20 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, మహిళా పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. పట్టణంలో తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్ సమస్యతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు రథం తిరిగే ప్రాంతం కాకుండా వేరే మార్గంలో వాహనాలు మళ్లించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

వైద్య శిబిరం ఏర్పాటు

రథోత్సవం సందర్భంగా అపశృతి చోటు చేసుకున్నా, ఏదైనా ప్రమాదం సంభవించినా వెంటనే చికిత్స చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శివాలయంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా షుగర్, బీపీ పరీక్షలు, జ్వరం, తలనొప్పి, జలుబు, షుగరు, బీపీ ముదలైన జబ్బులకు సంబధించిన మాత్రలు, సెలైన్‌లు అందుబాటులో ఉంచారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు

రథోత్సవం సందర్భంగా ఎటువంటి ఆటంకం కలగకుండా విద్యుత్ అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. రథం తిరిగే ప్రాంతాల్లో ఉదయం విద్యుత్ సరఫరా నిలిపి వేసి సర్వీస్ వైర్లను తప్పించారు. మధ్యాహ్నం రథోత్సవం ప్రారంభమైన వెంటనే వెనుక నుంచి సర్వీస్ వైర్లను పునరుద్ధరించి ప్రజలకు విద్యుత్ సరఫరా సమస్య లేకుండా చేశారు. ఎవరి విధులు వారు సక్రమంగా సకాలంలో నిర్వర్తించడంతో ఎక్కడా ఎలాంటి అవరోధాలు, ఆటంకాలు లేకుండా మొత్తం మీద రథోత్సవం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గుండ్లబ్రహ్మేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే అన్నా పూజలు

గిద్దలూరు రూరల్: నల్లమల అభయారణ్యంలో కొలువుదీరిన గుండ్లబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి మరుసటి రోజు సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.నరసింహరావు పర్యవేక్షణలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య అటవీ ప్రాంతంలోని స్వామివారిని ఎమ్మెల్యే అన్నా రాంబాబు దర్శించుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విహార యాత్రలు విజ్ఞానాన్ని పెంచుతాయి

యర్రగొండపాలెం: విహార యాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచుతాయని ఎంఈఓ పి.ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం ఆమనిగుడిపాడు ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులతో నాగార్జునసాగర్‌కు వెళ్తున్న బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విహార యాత్రలు విద్యార్థుల్లో విజ్ఞానంతోపాటు వినోదం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించి చదువుల్లో చురుకుగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. సృజనాత్మకతను పెంపొందించే విహార యాత్రలను ప్రతి పాఠశాలల హెడ్మాస్టర్లు చేపట్టాలని కోరారు. హెచ్‌ఎం విజయ పాల్గొన్నారు.

22న మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన ఈ నెల 22న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రావూరి జనార్దన్ తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.